క్లుప్తంగా

గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ



గురుకులంలో భోజనాలను పరిశీలిస్తున్న దృశ్యం

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలేం లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సాంఘిక సంక్షేమ గురుకుల జిల్లా సమన్వయాధికారి జి.గ్రేస్ శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పది, ఇంటర్మీడియట్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ఇప్పటినుంచే ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని, ఎటువంటి ఒత్తిడి లేకుండా చూడాలని స్పష్టం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆమెతో పాటు ప్రిన్సిపాల్ పి.పద్మావతి తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

కొత్తూరు: మండల కేంద్రంలోని భగత్‌సింగ్ ట్రస్టు సభ్యులు తమ ఔదార్యం చాటుకున్నారు. మండలంలోని లబ్బ గ్రామానికి చెందిన నిమ్మక సురేష్ భార్య రజనీ క్యాన్సర్‌తో బాధపడుతోంది. విశాఖపట్నంలో వైద్యం పొందుతున్న రజనీ వైద్య ఖర్చులు నిమిత్తం ట్రస్టు తరువున శుక్రవారం స్వగ్రామం లబ్బలో రజనీ అత్తకి రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన సురేష్‌కు సైతం ఇటీవల ఆక్సిడెంట్ అవ్వడంతో వారి కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది.

స్వయం ఉపాధికి శిక్షణ



కుట్టు శిక్షణ కేంద్రం పరిశీలిస్తున్న కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్

కొత్తూరు: ఇంటి వద్ద స్వయం ఉపాధి పొందేందుకు కుట్టు శిక్షణ ఇస్తున్నట్టు బీసీ కార్పొరేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో బీసీ కార్పొరేషన్‌కు చెందిన సెంటర్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ డవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. శిక్షణ పొందిన ప్రతీ మహిళకు ప్రభుత్వం నుంచి కుట్టు మిషన్లు అందిస్తామని చెప్పారు. ఆయనతో పాటు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు తదితరులు ఉన్నారు.

మాతాశిశు మరణాలు నివారించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పోలాకి: గ్రామీణ ప్రాంతాల్లో మాతాశిశు మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో ఎనిమిది నెలల కాలంలో ఒక్క ప్రసవం మాత్రమే జరగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మరింత మెరుగైన సేవలను అందించాలని సిబ్బందికి సూచించారు. ఆస్పత్రిలో ఖర్చులపై వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్ నివేదించారు. సమావేశపు గది ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో వైద్యాధికారి సుమప్రియ, ఎంపీడీవో సూర్యప్రకాశరావు, తహసీల్దార్ శ్రీనివాస్, సర్పంచ్ మజ్జి రమణమ్మ, వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు ఎంపీఏ నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు భాస్కరరావు, ఆరోగ్య విస్తరణాధికారి నల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నానో ఎరువులపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో సంధ్య

హిరమండలం: రైతులకు నానో యూరియా, డీఏపీల వాడకంపై అవగాహన అవసరమని మండల వ్యవసాయాధికారి బి.సంధ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తహసీల్దార్ హనుమంతురావుతో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించారు. నానో యూరియాను పిచికారీ చేసిన వెంటనే మొక్కలకు కావాల్సిన పోషకాలు అందుతాయని తెలియజేశారు. ప్రతి ఒక్క రైతు నానో ఎరువులు వినియోగించాలని సూచించారు.

నిర్లక్ష్యపు నీడలో..!



హడ్డుబంగి గెడ్డలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, చెత్త

- హడ్డుబంగి గెడ్డలో పేరుకుపోయిన పూడికలు
- కొత్తూరు రెల్లివీధిలోకి వరద నీరు
- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



రెల్లివీధిలోకి వచ్చిన వరద నీరు

కొత్తూరు: మండలంలో ప్రధాన సాగునీటి కాలువల్లో కొత్తూరులోని హడ్డుబంగి గెడ్డ ఒకటి. ఈ గెడ్డ ద్వారా కొత్తూరు, సిరుసువాడ, కుంటిభద్ర, పారాపురం, కలిగాం తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 2 వేలు ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇటువంటి సాగునీటి గెడ్డ నిర్వహణపై నీటి పారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా మండల కేంద్రం కొత్తూరులోని రెల్లివీధి ప్రజలకు శాపంగా మారింది. హడ్డుబంగి గెడ్డ మండల కేంద్రం కొత్తూరు గ్రామంలోని రెల్లివీధి మధ్య నుంచి ప్రవహిస్తుంది. అయితే ఈ గెడ్డ ఆక్రమణలకు గురవ్వడంతో పాటు పూడికలతో నిండిపోయింది. సంవత్సరాలు నుంచి గెడ్డలో పూడికలు తొలగించకపోవడంతో గెడ్డలోకి కొద్దిపాటి వరద నీరు వచ్చినా, రెల్లివీధిలోకి వెళ్లిపోతుండడంతో పలు కుటుంబాలు నరకయాతన పడుతున్నాయి. ఈ వీధిలోకి వరద నీరు ప్రవేశిస్తుండడంతో పారిశుద్ధ్య నిర్వహణ పంచాయతీకి భారంగా మారుతోంది.

పూడికలు తీసేందుకు చర్యలు

హడ్డుబంగి గెడ్డలో పేరుకుపోయిన పూడికలు తొలగించేందుకు అంచనాలు తయారు చేయడం జరుగుతోంది. అంచనాలు తయారు చేసిన తర్వాత పనులు మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాము. ప్రభుత్వం ఆమోదం తెలిపిన వెంటనే గెడ్డలో పూడికలు తీసేందుకు చర్యలు చేపడతాము.

– పి.ప్రసాదరావు, నీటి పారుదల శాఖ జేఈఈ, కొత్తూరు మండలం

అంటువ్యాధులు ప్రబలకుండా...

వరద నీరు వీధిలోకి ప్రవేశించిన ప్రతిసారీ ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా పంచాయతీ నిధులతో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. ఇలాగే నిరంతరం జరుగుతున్నా నీటి పారుదల శాఖ అధికారులు హడ్డుబంగి గెడ్డలో పూడికలు తొలగించకపోవడంతో ప్రజలు, పంచాయతీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రెల్లి వీధిలోకి వరద నీరు చేరడంతో అక్కడి ప్రజల కష్టాలు అన్నీఇన్నీ కావు. అందువలన ఇప్పటికైనా నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి హడ్డుబంగి గెడ్డలో పేరుకుపోయిన చెత్తను తొలగించి రెల్లివీధిలోకి వరద నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పూడికలు తొలగించాలి



హడ్డుబంగి గెడ్డలో చెత్త ఎక్కువగా ఉన్నందున వీధిలోకి వరద నీరు వస్తోంది. కాలువ నీరు వీధుల్లోకి చేరుతుండడంతో దుర్వాసన వలన అవస్థలు పడుతున్నాం. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– బొమ్మాళి హేమలత, రెల్లివీధి, కొత్తూరు

రోగాలు బారిన పడుతున్నాం



హడ్డుబంగి గెడ్డలో సంవత్సరాలు నుంచి పూడికలు తొలగించకపోవడం వలన రెల్లివీధిలోకి వరద నీరు చేరుతోంది. కలుషితమైన గెడ్డ నీరు ఇళ్ల ముందు నుంచి ప్రవహించడంతో పలు అంటురోగాల బారిన పడుతున్నాము. అధికారులు స్పందించి గెడ్డలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలి.

– సొండి రాజా, రెల్లివీధి, కొత్తూరు

పోలింగ్ కేంద్రాలు విడదీయండి

నరసన్నపేట: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలు ఓటర్లకు దూరంగా ఉన్నాయని, వీటిని విడదీసి ఓటర్లకు సౌకర్యవంతంగా సమీపంలో ఏర్పాటు చేయాలని నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళితో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు తహసీల్దార్ సత్యనారాయణకు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఆరంగి మురళి, రాజాపు అప్పన్న, కేసీహెచ్‌ఈ గుప్త తదితరులు మాట్లాడుతూ.. లకిమేర, బుచ్చిపేట, చింతువానిపేట, గెడ్డవానిపేటల్లో కొత్తగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని విన్నవించారు. అయితే ప్రస్తుతం ఓటర్ల జాబితా పరిశీలన చేస్తున్నామని, అనంతరం పోలింగ్ కేంద్రాలు అదనంగా ఏర్పాటు తదితర అంశాలపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీనిచ్చారు. అలాగే ఒకే పోలింగ్ కేంద్రంలో ఒక కుటుంబానికి చెందిన ఓట్లు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీటీ శరత్ తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఏపీఎంగా విజయకుమారి



హిరమండలం: ఎల్ఎన్‌పేట మండలం వెలుగు ఏపీఎంగా విజయకుమారి శుక్రవారం వెలుగు కార్యాలయంలో బాధ్యతల స్వీకరించారు. ఈమె పాతపట్నం నుంచి బదిలీపై వచ్చారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన రవిరాజ్ పాతపట్నంకు బదిలీపై వెళ్లారు. విజయకుమారికి వెలుగు సీసీలు, వీవోలు, మండల మహిళా సమాఖ్య సభ్యులు అభినందనలు తెలిపారు.

సెప్టెంబర్ 14న ధర్మ సమ్మేళనం

ఆమదాలవలస: సెప్టెంబర్ 14వ తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో స్వామిజీల ఆధ్వర్యంలో నిర్వహించనున్న హిందూ న్యాయవాదుల ధర్మ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని హిందూ న్యాయవాదుల ధర్మ సమ్మేళనం సభ్యుడు జి.శ్రీకృష్ణ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆమదాలవలస కోర్టు బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం ఆయన ఆహ్వాన పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం బాగుండాలంటే ధర్మం బాగుండాలని అన్నారు. పలు రాష్ట్రాలు, ప్రాంతాల్లో క్రిస్టియన్ లాయర్ ఫోరమ్, ముస్లిం లాయర్ ఫోరమ్‌లు ఏర్పాటు చేశారని, అందువలన హిందూ లాయర్ ఫోరమ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు తమ్మినేని అన్నం నాయుడు, కిల్లి మార్కండేయశ్వరరావు, కె.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

లింగాకర్షక బుట్టలతో దోమల నివారణ

నరసన్నపేట: వరితో పాటు కాయగూరల పంటల్లో తెల్ల, పచ్చ దోమల నివారణకు లింగాకర్షక బుట్టలు ఎంతగానో ఉపకరిస్తాయని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ తోట రమణ అన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల రైతులకు దేవాదిలో శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాకర్షక బుట్టల ప్రాధాన్యతను వివరించారు. అలాగే కాండం తొలిచే పురుగులు కూడా వీటి ద్వారా నివారించవచ్చని తెలిపారు. ప్రతీ ఎకరాకు 15 పసుపు పళ్లాలు, 6 లింగాకర్షక బుట్టలు పెట్టాలన్నారు. ఈ మేరకు ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కాలి బాటలు...
దిగుబడికి రాచ బాటలు..!



కొరసవాడలో ఏర్పాటు చేసిన కాలిబాటలు

- ఏపుగా పెరగనున్న పైరు
- గాలి, వెలుతురు తగలడంతో దిగుబడులు



పెద్దసీదిలో కాలిబాటలు ఏర్పాటు చేస్తున్న రైతులు

పాతపట్నం: ఇటీవల విస్తారంగా వర్షాలు కురవడంతో ఖరీఫ్ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. అయితే వరినాట్లు వేసే సమయంలో రైతులు పొలంలో కాలిబాటల ఏర్పాటుకు ప్రాధాన్యమివ్వాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. పొలంలో కాలిబాటలు తీసుకోవడం వలన ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వివరిస్తున్నారు. అయితే చాలా మంది రైతులు కాలిబాటలు వేయడంపై అంతగా ఆసక్తి చూపరు. దీనికి కారణం కాలిబాటల ఏర్పాటుకు అదనంగా ఖర్చులు, కాలిబాట మార్గంలో వరినాట్లు తొలగించడం వలన దిగుబడి తగ్గుతుందన్న అపోహతో ఉంటున్నారు. అయితే నాట్లు వేసిన పొలంలో ప్రతీ రెండు మీటర్ల దూరంలో కాలిబాటలను వేయడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

కాలిబాటలు వేసే విధానం

కాలిబాటలు వేసే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. తూర్పు పడమర దిశగా ప్రతీ రెండు మీటర్లకు ఒక కాలిబాట ఏర్పాటు చేసుకోవాలి. ప్లాస్టిక్ లేదా కొబ్బరి డొక్క తాడు తీసుకొని చేను గట్టుకు ఒకవైపు గట్టు నుంచి మరో వైపు గట్టుకు తాడును బాగా సాగదీసి కట్టాలి. తాడు వెంబడి 12 సెంటీమీటర్ల వెడల్పుతో వరి నాట్లు తొలగించాలి. ఈ నాట్లు పొలంలో పల్చగా ఉన్న వేరే ప్రాంతాల్లో నాటుకోవచ్చు. వెదజల్లే పద్ధతిలో సాగు చేసే వారు విత్తనాలు చల్లిన 15 రోజుల నుంచి 20 రోజుల వ్యవధిలో వరి మొక్కలను తొలగించి, కాలిబాటలు వేసుకోవాలి.

కాలిబాటల వలన ప్రయోజనాలు

కాలిబాటలు వేయడం వలన వరి దుబ్బుల మొదళ్లకు గాలి, సూర్యరశ్మి చక్కగా తగలడంతో పైరు ఆరోగ్యవంతంగా ఎదుగుతుంది. చీడపీడల బెడద కొంతవరకు తగ్గుతుంది. కాలిబాట మార్గంలో వెళ్లి కలుపు తొలగించడానికి, తెగుళ్లు, చీడపీడలు ఆశిస్తే సులభంగా గుర్తించడానికి, ఎలుకల నివారణకు, ఎరువులు, పురుగు మందులు చల్లుకోవడానికి అనువుగా ఉంటుంది. తుఫాన్‌లు, భారీ వర్షాల వంటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు పైరులో కిరణజన్య సంయోగ క్రియ సమర్థవంతంగా జరిగి దిగుబడి తగ్గకుండా కాలిబాటలు ఉపయోగపడతాయి. వరి మడిలో భూమి తడి లేకుండా ఆరబెట్టే వీలు కలుగుతుంది. వరికోత సమయంలో సులభంగా కోత కోసుకునేందుకు అనువుగా ఉంటుంది.

పాతపట్నంలో వరిసాగు వివరాలు

మండలం	పాతపట్నం	మెళియాపుట్టి	హిరమండలం	కొత్తూరు	ఎల్.ఎన్.పేట
హెక్టార్లు	8,699	7,741	3,364	10,374	4,464
రైతులు	14,726	12,235	6,716	13,914	8,487

కాలిబాటలు వేసుకుంటున్నాం



మేము చాలాకాలంగా పొలంలో కాలిబాటలు వేసుకుంటున్నాం. దీని వల్ల రైతులకు ఎంతో ఉపయోగం ఉంది. గతంలో కాలిబాటల వల్ల దిగుబడి తగ్గుతుందని అపోహ పడేవాళ్లం. వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించడంతో నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా కాలిబాటలు వేస్తున్నాను. దీనివల్ల పొలం అంతా కలియ తిరిగి చూసుకునే అవకాశం ఉంది. ఎరువులు, మందులు చల్లడం కూడా సులభంగా ఉంది.

– మద్ది నారాయణరావు, పెద్దసీది, పాతపట్నం మండలం

ప్రయోజనమే



రైతులు పొలంలో కాలిబాటలు తప్పనిసరిగా వేసుకోవాలి. దీనివల్ల రైతులకు లాభమేతప్ప ఎలాంటి నష్టం ఉండదు. ఎకరం పొలంలో కాలిబాటలు వేయడానికి కూలీలకు రూ.800 నుంచి రూ.1,000 వరకూ ఖర్చు అవుతుంది. అయితే వీటివల్ల మూడు నుంచి నాలుగు బస్తాల అదనపు దిగుబడి వస్తుంది. కలుపు మొక్కల తొలగింపు, చీడపీడలను సకాలంలో గుర్తించడం, సస్యరక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుంది. వ్యవసాయ సిబ్బంది ప్రతీ రైతు పొలంలో కాలిబాటలు వేసేలా ప్రోత్సహిస్తున్నారు.

– పి.కిరణ్‌వాణి, మండల వ్యవసాయాధికారి, పాతపట్నం

మోసం చంద్రబాబు నైజం



తోటవాడలో క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రవికుమార్ తదితరులు

- చింతాడ రవికుమార్
- తోటవాడ, ఉప్పినివలసలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ

బూర్జ: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ప్రజలను మోసం చేయడం సీఎం చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. మండలంలోని తోటవాడ, ఉప్పినివలస గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది కాలంలో ప్రజలకు కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను వివరించారు. అమలు చేస్తున్న కొద్దిపాటి సంక్షేమ పథకాల్లో కూడా భారీగా కోతలు విధించారని మండిపడ్డారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం మోసాలను వివరించి క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజ్జిపురం రామారావు, వైస్ ఎంపీపీ కరణం కృష్ణమూర్తినాయుడు, మాజీ ఏఎంసీ చైర్మెన్, మామిడివలస ఎంపీటీసీ గుమ్మడి రాంబాబు, నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఎం.కిరణ్ కుమార్, మండల యువజన విభాగ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, కృష్ణాపురం వార్డు ఇన్‌చార్జి కూన రామకృష్ణ, సర్పంచ్‌లు సూర ఆనందరావు, జీడి వేణు, బూరి శ్రీరామమూర్తి, బొడ్డేపల్లి వెంకటసత్యం, మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి నారాయణమూర్తి, ఉప సర్పంచ్‌లు కరణం అనిల్‌నాయుడు, గండెవలస వెంకటరమణ, నాయకులు బొడ్డేపల్లి నాగరాజు, జల్లు బలరాంనాయుడు, కొంచాడ రాము, మజ్జి నర్సింగరావు, లఖినాన కృష్ణమూర్తి, ఏగు రాజారావు, గుండ్ర సుధాకర్, ఇప్పిలి తిరుపతిరావు, వై.లక్ష్మణరాజు, ఎం.సింహాచలం, గేదెల వెంకటరమణ, కొరికాన వెంకటరావు, ఎస్.అప్పన్న, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటుపరం కాకుండా అడ్డుకోవాలి



విలేకరులతో మాట్లాడుతున్న తమ్మినేని చిరంజీవి నాగ్

ఆమదాలవలస: దశల వారీగా విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వంపై కూటమి నాయకత్వం కనీసం నోరు మెదపడం లేదని, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు దీన్ని అడ్డుకోవాలని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. శుక్రవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు కర్మాగారంలోని 32 విభాగాలను ప్రైవేటుపరం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ఎన్నికల ముందు ఉక్కు పరిశ్రమ గురించి ఉపన్యాసాలతో ఊదరగొట్టిన ఎంపీ రామ్మోహన్‌నాయుడు ఇప్పుడు ఎందుకు సైలెంట్‌గా ఉన్నారని ప్రశ్నించారు. ఇప్పటికే 1,150 మంది కార్మికులు రోడ్డున పడ్డారని, కంపెనీ మొత్తం ప్రైవేటుపరమైతే ఉద్యోగులు పూర్తిగా ఉపాధి కోల్పోతారని ఆవేదన చెందారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కానివ్వమని ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడిపై ఉందన్నారు. ఎన్డీఏలో భాగస్వాములైన కూటమి నాయకులు కేంద్రాన్ని నిలదీయాలని సూచించారు. కమీషన్ల కోసం ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేస్తే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



నరసన్నపేట: వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు



కొత్తూరు: సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న దృశ్యం

నరసన్నపేట: స్థానిక మారుతీ నగర్‌లోని సత్యసాయి మందిరంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. మందిరం కమిటీ ప్రతినిధులు ఎంఎల్ నాయుడు, పాటోజీ నాగేశ్వరరావు, జామి రామకృష్ణ, ఎం.అమ్మాయమ్మల ఆధ్వర్యంలో పూజలు జరగగా, సత్యవరాగ్రహారానికి చెందిన మావుడూరి జగదీష్ బాబు మహిళలచే పూజలు చేయించారు. పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కొత్తూరు: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో చివరి శ్రావణ శుక్రవారం కావడంతో ఆలయ ప్రధాన అర్చకులు మామర్తి కృష్ణమాచార్యాలు వేద మంత్రాల మధ్య సామూహిక కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా ఆలయంలో అమ్మ విగ్రహానికి గాజులతో మహిళా భక్తులు అలంకరించారు. కార్యక్రమంలో టీటీడీ అధ్యాత్మిక మండల కమిటీ కన్వీనర్ పాగిరి రవి తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

పాతపట్నం: గ్రామాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునేవారు, తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని ఎస్‌ఐ బి.లావణ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో చేసుకోవాలని, వినాయక మండపాల వద్ద క్యూ కోడ్ ఏర్పాటు చేసుకోవాలని, ఎటువంటి రుసుము లేదన్నారు. నవరాత్రుల్లో గొడవలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత కమిటీ సభ్యులదేనన్నారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

హిరమండలం: వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి అని ఎస్‌ఐ మహ్మద్ యాసిన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేస్తే పంచాయతీ అనుమతులు తప్పనిసరి అన్నారు. ట్రాఫిక్, జనజీవనానికి ఇబ్బందులు లేకుండా ఉండే ప్రాంతాల్లో మాత్రమే జరుపుకోవాలన్నారు. మైకులతో పాటు సౌండ్ బాక్సులకు డీఎస్పీ అనుమతులు తప్పనిసరి అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో అశ్లీల రికార్డింగ్ డ్యాన్సులు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బూర్జ: వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని ఎస్‌ఐ ఎం.ప్రవల్లిక సూచించారు. గణేష్ మండపాలు ఏర్పాటు చేసుకునేవారు ముందుగా కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మైక్‌సెట్స్ ఏర్పాటుకు డీఎస్పీ అనుమతి పొందాలని, డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. రాత్రి 10.00 గంటల తర్వాత ఎటువంటి కార్యక్రమాలు జరపరాదన్నారు.

దాతల సాయం అభినందనీయం

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎంఈవో రాంబాబు అన్నారు. శుక్రవారం భగీరథపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గోపాలరావు పాఠశాలలో విద్యార్థుల సంక్షేమానికి రూ.2 వేలు వితరణగా అందించారు. ఆ నగదును ఎంఈవో చేతులమీదుగా హెచ్ఎం లక్ష్మీకి అందజేశారు. గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీమా ప్రీమియం చెల్లించాలి

పొందూరు: స్థానిక పీఏసీఎస్‌లో పంట రుణాలు రెన్యూవల్ చేసుకున్న రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ప్రీమియంను ఈనెల 31వ తేదీలోగా చెల్లించాలని పీఏసీఎస్ చైర్మన్ వండాన మురళీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట రుణాలు చెల్లించిన రైతులు ఒక ఎకరానికి పంటల బీమా నిమిత్తం రూ.160ల ప్రీమియంను చెల్లించాలని పేర్కొన్నారు. ఈ ప్రీమియంతో పాటు రైతు 1–బీ, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్‌తో పీఏసీఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

సేంద్రియ ఎరువులతో మేలు

మెళియాపుట్టి: పంటల్లో సేంద్రియ ఎరువులు ఉపయోగించడం వలన రైతులకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి దానకర్ణుడు అన్నారు. మండలంలోని కొసమాల గ్రామంలో గ్యాప్ సర్టిఫికేషన్ పొలంబడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వ్యవసాయంలో సాంకేతిక పద్ధతులను అవలంబించాలని సూచించారు. స్వల్ప, దీర్ఘకాలిక ప్రయోగాల గూర్చి తెలిపారు. సేంద్రియ ఎరువులు పొలంలోనే తయారు చేసి, వాడుకునే పద్ధతిని వివరించారు. కార్యక్రమంలో వీఏఏ క్రాంతి తదితరులు పాల్గొన్నారు.